క్లుప్తంగా

ఏపీపీగా 'మారౌతు'



తెనాలిరూరల్: తెనాలికి చెందిన సీనియర్ న్యాయవాది మారౌతు వెంకట సాంబశివరావును 11వ జిల్లా అదనపు కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఏపీపీగా బాధ్యతలను స్వీకరించారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి గౌరీ శంకర్, ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు, ఇతర కార్యవర్గ సభ్యులు అభినందించారు.

5న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభ



తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభను జూన్ 5న నిర్వహించనున్నారని, దానిలో అందరూ పాల్గొనాలని యూనియన్ తెనాలి ప్రధాన కార్యదర్శి కారుమూరి కమలకుమారి కోరారు. పాత ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమావేశానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రానున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దగ్గుపాటి సుధీర్, దీపాల శ్రీనివాసరావు, షేక్ అన్వార్, అందె బాలచంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత వైద్యశిబిరం

200 మందికి వ్యాధినిర్ధారణ పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్



తెనాలి: వ్యాధిరహిత తెనాలి కోసం కృషిచేస్తున్న పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'హెల్త్ ఆన్ వీల్స్'తో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్-చక్ర క్యాన్సర్ సెంటర్ తక్కెళ్లపాడు సంయుక్తంగా జరిపిన వైద్యశిబిరంలో డాక్టర్ డి.శారద, ఇతర వైద్యులు, 200 మందికి బీపీ, షుగరు, థైరాయిడ్, స్కానింగ్, ఎక్స్‌రే, పాప్‌స్మియర్ వంటి పరీక్షలను చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి హాజరై శిబిరాన్ని ప్రారంభించి, కరపత్రాన్ని ఆవిష్కరించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి



తెనాలిరూరల్: ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీ కొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగలకుదురుకు చెందిన షేక్ సుభాని (24) గురువారం అర్ధరాత్రి దాటాక తెనాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డు పక్కన ఎలాంటి పార్కింగ్ లైట్లు, ఇతర భద్రతా చర్యలు లేకుండా రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇదయతున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ శుక్రవారం తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

మేడికొండూరు: మండల పరిధిలోని మేడికొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష అధ్యక్షతన ఉద్యోగుల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘానికి మద్దతు తెలిపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పోతురాజు, ఫిరంగిపురం యూనిట్ కార్యదర్శి కె.దాసు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో సమస్యలు నివాసం!

- కాల్వల్లోనే సెప్టిక్ పైప్‌లైన్లు
- దుర్గంధభరితంగా మారిన మురుగు కాల్వలు
- ఇబ్బందులు పడుతున్న గృహకల్పవాసులు

తెనాలిఅర్బన్: చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్ప సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. సెప్టిక్, డ్రెయినేజ్ వ్యవస్థలు పాడైపోవటంతో గృహకల్పవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది నుంచి అధికారులకు మొరపెట్టుకుంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవటంతో దుర్గంధభరిత జీవితాన్ని గడుపుతున్నారు.

మారీసుపేట చంద్రబాబు నాయుడు కాలనీలో 2009లో రాజీవ్ గృహకల్పను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నిర్మించారు. దానిని ఆయనే స్వయంగా తెనాలి వచ్చి ప్రారంభించారు. అక్కడ 13 బ్లాక్‌లలో సుమారు 425 అపార్ట్‌మెంట్‌లను నిర్మించి పేదలకు ఇచ్చారు. అప్పట్లో అక్కడ అంతర్గత రోడ్లు, డ్రెయినేజ్, సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు.

మురుగు కాల్వల్లోనే సెప్టిక్

రాజీవ్ గృహకల్పలో సెప్టిక్ పోయే సిస్టం పూర్తిగా దెబ్బతింది. గృహకల్ప సముదాయం వెనుక వైపు పెద్ద సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసినప్పటికీ దానికి అనుసంధానంగా ఉన్న పైప్‌లైన్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లో నివశించే వారు కాల్వల్లోకి వెళ్లే విధంగా పైప్‌లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మురుగు కాల్వలన్నీ మలవ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఏడాది నుంచి ఇలాంటి పరిస్థితి అక్కడ నెలకొని ఉన్నా దాన్ని పరిష్కరించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు.



రాజీవ్ గృహకల్ప సముదాయం



దుర్గంధభరితంగా ఉన్న మురుగు కాల్వలు

చేసేదిలేక ఆ ప్రాంత వాసులు బ్రతుకు జీవుడా అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

పాడైన డ్రెయినేజ్ వ్యవస్థ

రాజీవ్ గృహకల్పలోని అంతర్గత డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పోయే దారిలేక అక్కడే నిలచిపోతున్నాయి. దీనివల్ల కాల్వలు అన్ని దుర్గంధభరితంగా మారాయి. అలాగే దోమల ఉధృతి కూడా పెరిగిందని, అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి డ్రెయినేజ్ వ్యవస్థలను బాగు చేయించటంతో పాటు సెప్టిక్ వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి



గృహకల్పలో అనేక సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి. సరైన డ్రెయినేజ్, సెప్టిక్ వ్యవస్థలులేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మురుగు కాల్వలను కూడా బాగు చేయకపోవటం వల్ల మురుగు అక్కడే నిలచిపోయి దుర్గంధభరితంగా మారింది. అంతర్గత రోడ్లు నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరు చేశారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించటంతో పాటు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి.

– పెదలంక లక్ష్మి లావణ్య, 24వ వార్డు కౌన్సిలర్

నూతన సెప్టిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి



సెప్టిక్ వ్యవస్థ ఏడాది క్రితం పూర్తిగా దెబ్బతింది. అప్పటి నుంచి కొందరు సెప్టిక్ పైప్‌లను మురుగు కాల్వల్లో ఏర్పాటు చేశారు. దీంతో వ్యర్థాలన్నీ కాల్వల్లోనే ఉంటున్నాయి. ఆరు బయట కొద్దిసేపు కూడా కూర్చోలేని పరిస్థితి అక్కడ నెలకొంది. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి నూతన సెప్టిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

–బత్తుల రమేష్, రాజీవ్ గృహకల్ప వాసి

డ్రెయినేజ్ వ్యవస్థను పునరుద్ధరించాలి



రాజీవ్ గృహకల్పలో డ్రెయినేజీ వ్యవస్థ పాడైంది. మురుగు పోయే దారిలేక అది అక్కడే నిలచిపోతోంది. దీంతో దోమల సంచారం ఎక్కువైంది. అవి కుట్టడం వల్ల వ్యాధులు వస్తున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలి.

–టి.వెంకట సుబ్బారావు, రాజీవ్ గృహకల్పవాసి.

త్వరలో డ్రెయినేజ్ సమస్య పరిష్కారిస్తాం

రాజీవ్ గృహ కల్ప భవన సముదాయాన్ని నిర్మించే సమయంలో భవనం కంటే కొద్దిగా ఎత్తులో సెప్టిక్ ట్యాంక్‌ను నిర్మించారు. దీనివలన ట్యాంక్ కొంత భాగం నిండగానే అది ఫుల్ అయినట్లు కనిపిస్తుంది. దీనివలన అక్కడ సెప్టిక్ పోయే దారిలేక ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం కోసం డిజైన్ నిర్మిస్తున్నాం. అవి అన్ని పూర్తి అవగానే నిర్మాణాలు ప్రారంభించి సమస్యను పరిష్కారిస్తాం.

– ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ మున్సిపల్ ఇంజనీర్, తెనాలి.

విధులు సమర్థంగా నిర్వహించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 16,17,18 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తూర్పు కాల్వలో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలవల్లో వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

- మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతి రావు సూచించారు. మార్కెట్ ఏరియాలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత పనులు జరుగుతాయని చెప్పారు. ఆయన వెంట పలువరు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

చౌకధర దుకాణాల వద్ద రేషన్ పంపిణీకి ఏర్పాట్లు

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం 1వ తేదీ నుండి చౌకధర దుకాణాల్లోనే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్టు తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల యజమానులతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతంలో మాదిరిగా ఇకపై జూన్ 1 నుంచి 15 వరకు ప్రజా పంపిణీ విధానం దుకాణాల వద్దే రేషన్ సరఫరా విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు మౌలిక సదుపాయాలను దుకాణాల వద్ద కల్పించాలని చెప్పారు. ఆలస్యంగా వచ్చిన వినియోగదారులను వట్టిచేతులతో పంపించకుండా రేషన్ అందేలా సమయం కేటాయించాలని నిర్దేశించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఇటీవల వార్డుల్లో పర్యటించిన తమకు సకాలంలో రేషన్ అందలేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వినిపించాయని, ప్రజా సమస్యలకు తావులేకుండా పాత పద్ధతిలో దుకాణాల వద్దే రేషన్ పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. చౌకధర దుకాణాల్లో సేవలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ వాహనాలను ఉచితంగా ఆయా లబ్ధిదారులకు బదలాయించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా బియ్యం అక్రమ రవాణా అరికట్టవచ్చని తెలిపారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు ఈనెల 27వ తేదీన నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పహల్గాం దాడిని మతంతో ముడిపెట్టి ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని కొందరు చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న వామపక్ష పార్టీలు, దళిత, క్రైస్తవ, ముస్లిం సంఘాలు, మేధావులు సమైక్యంగా ఉండి దేశ సమగ్రతను కాపాడుకోవాలన్నారు. దేశంలో బీజేపీ పరిపాలన అరాచకంగా కొనసాగుతోందని విమర్శించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి నగర పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం జరిగే బహిరంగ సభను, ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రభాకర్, సీపీఐ ఎంఎల్ నాయకులు కోటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె.రామారావు, సీపీఎం నాయకులు రాఘవులు, బాలకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ తాడేపల్లి నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏపీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.స్టీవెన్, సీపీఎం నాయకులు బూరగ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు చేస్తున్న దీక్ష 171వ రోజుకు చేరుకుందని అన్నారు. తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



దీక్షా శిబిరంలో నాయకులు

కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, రామారావు, ఇస్మాయిల్, మాణిక్యాలరావు, రమాదేవి, దుర్గాభవాని, లక్ష్మి, శారద, ఇమాంబి, భవాని తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో రూ.9.55 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బాధితులు పులివర్తి అభిరామ్‌కు రూ.6,04,282లు.. మన్యం బాలాజీకు రూ.3,01,700లు.. వెలవల వరలక్ష్మికి రూ.49,324లు చెక్కులను నాయకులు బాధితుల ఇళ్ల వద్ద పంపిణీ చేశారు.

• ప్రైవేటు' సేవలో మున్సిపల్ జేసీబీలు



మున్సిపల్ వాహనాలు ప్రైవేటు సేవలో తరిస్తున్నాయి. పట్టణంలో పారిశుద్ధ్య కార్యకలాపాల కోసమని కొనుగోలు చేసిన కొత్త వాహనాలను సైతం ఇందుకోసం వినియోగిస్తున్నారు. ఇప్పటికే ఉన్న వాహనాలకు అదనంగా రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ, మూడు కాంపాక్టర్లను ఈ మధ్యనే కొనుగోలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.60 కోట్లతో మున్సిపాలిటీ వీటిని సమకూర్చుకుంది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత మార్చి 24న వీటిని స్థానిక శివాజీచౌక్‌లో ప్రజల సమక్షంలో ప్రారంభించారు. పగటిపూట విధుల్లో ఉండే మున్సిపాలిటీ వాహనాలన్నీ సాయంత్రం ఆరు గంటలకల్లా గంగానమ్మపేటలోని వాహన షెడ్డుకు చేరాల్సిందే. ఆ తర్వాత జేసీబీ వాహనాలు రాత్రి వేళల్లో ప్రైవేటు వ్యక్తులకు సేవలను అందిస్తున్నాయి. ప్రైవేటు స్థలాల్లో మెరక పనులు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులను చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. చీకట్లో జేసీబీ లైట్లు వేసుకుని మరీ సేవలందిస్తున్నారు. బండిలో ఆయిల్ కూడా మున్సిపాలిటీదే. మున్సిపాలిటీ కొత్తగా కొనుగోలు చేసిన జేసీబీ పట్టణంలోని అయితానగర్ ప్రాంతంలో ప్రైవేటు స్థలంలో రాత్రిపూట పనులు చేయిస్తున్న దృశ్యాన్ని ఫొటోలో చూడొచ్చు. స్థానికులు ఈ ఫొటోను తీసి 'సాక్షి'కి పంపారు.

–తెనాలి

చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలి

గ్రామ సభలో ముక్త కంఠంతో తెలియజేసిన వామపక్షాలు, పార్టీల నాయకులు

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు సెంటర్‌లో 8 ఎకరాల పున్నమ్మ చెరువును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను హైడ్రా తరహాలో కూల్చివేయాలని వామపక్ష, టీడీపీ, రైతు సంఘం నాయకులు డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావుకు తెలియజేశారు. పున్నమ్మ చెరువు ఆక్రమణపై శుక్రవారం తాడికొండ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు డీఎల్‌పీవో శ్రీనినవాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామస్తులు, పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ.. అడ్డరోడ్డు ప్రధాన రహదారి వెంట పున్నమ్మ చెరువును కాపాడాలని కోరారు. సీఆర్డీయే అనుమతి లేకుండా నిర్మాణాలు ఎలా చేపడతారని ప్రశ్నించిన ఆయన తక్షణమే అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలన్నారు. మాజీ యార్డు చైర్మన్ గుంటుపల్లి మధుసూధనరావు ఆక్రమణలపై మాట్లాడారు. పున్నమ్మ చెరువును ఖాళీ చేయించాలని పలు పార్టీల నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, స్థానిక నాయకులు ముప్పాళ్ల శివ శంకరరావు, పచ్చల సాంబశివరావు, పచ్చల శివాజీ, కాబోతు ఈశ్వరరావు, తలశిల ప్రసన్న, హనుమంతరావు, వైస్ ప్రెసిడెంట్ ఉయ్యూరు వెంకటరెడ్డి, బీఎస్పీ నాయకులు బాబురావు, సీపీఎం నాయకులు చింతల భాస్కర రావు, కనగాల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు రిమాండ్

తెనాలిరూరల్: మండలంలోని ఖాజీపేట గ్రామలలో గల లక్ష్మీమైసమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితులను రూరల్ పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకు వచ్చి కోర్టులో హాజరుపరిచారు. రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖాజీపేట గ్రామంలోని లక్ష్మీ మైసమ్మ తల్లి గుడిలో ఈ నెల 2వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి అమ్మవారి వెండి కిరీటం, బంగారు మంగళసూత్రాలు, ఇతర వస్తువులు అపహరించుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ చోరీ కేసులో గుంటూరు నల్లపాడు పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, తెనాలి మండలం ఖాజీపేట ఆలయంలో చోరీ విషయాన్ని అంగీకరించారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన నార్సింగ్ గంగాధర్, నార్సింగ్ మహేష్, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన వేమవరపు విద్యాసాగర్, తెనాలి పట్టణ సీఎం కాలనీకి చెందిన కారంపూడి విజయ్ కుమార్, బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన పుట్టా వెంకటేష్ గతంలో నేరాలు చేసి జైలుకు వెళ్లారు. అక్కడ వీరందరికి పరిచయమై జైలు నుండి విడుదలయి వచ్చాక నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని పీటీ వారంట్ పై గుంటూరు సబ్ జైలు నుండి తీసుకొని తెనాలి రూరల్ పోలీసులు వెండి కిరీటాన్ని స్వాధీనపర్చుకున్నారు. నిందితులను తెనాలి న్యాయమూర్తి ఎదుట శుక్రవారం హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

తెనాలిరూరల్: పదో తరగతి సప్లమెంటరీ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రెగ్యులర్ విద్యార్థులకు, ఓపెన్ స్కూల్ విధానంలో పరీక్ష రాస్తున్న వారికి సప్లమెంటరీ పరీక్షలు ఏకకాలంలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ ద్వారా పరీక్ష కేంద్రాల వివరాలను, విద్యార్థుల హాజరు శాతం, పరీక్షలు నిర్వహిస్తున్న తీరుపై ఆరా తీశారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో లక్ష్మీనారాయణ ఉన్నారు.

నమస్తే స్కీంను ఉపయోగించుకోండి

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమస్తే స్కీంను అర్హులైన వారందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శుక్రవారం నమస్తే స్కీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చిత్తు కాగితాలు, జుట్టు, పాత ఇనుము, ప్లాస్టిక్ డాబాలు సేకరించే వారి కోసం స్కీంను ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. స్కీంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన ప్రభుత్వం ఐడీ, హెల్త్ కార్డులతో పాటు పీపీ కిట్లు, వారి పిల్లలకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, స్వచ్ఛంధ్ర కార్పోరేషన్ కో-ఆర్డినేటర్ అనిల్‌కుమార్, దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హేమలత, జిల్లా కో-ఆర్డినేటర్ నిర్మల, రజిని పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

కులగణన ప్రక్రియను వేగవంతం చేయాలి

మంగళగిరి టౌన్: కుల గణన ప్రక్రియను కేంద్రం వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర మంత్రి మండలి కుల గణనకు ఆమోదం తెలుపుతూ విధాన నిర్ణయం తీసుకుని కూడా విధి విధానాలను రూపొందించకుండా జాప్యం చేయడం తగదని అన్నారు. ఆయా కులాల జనాభా దామాషా మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధికి దోహదపడాలని కోరారు. 2047 వికసిత భారత్ దార్శనికత మేరకు దేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్న ఆశాభావాన్ని ఆయన ఆ ప్రకటనలో వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి చుట్టు పక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. నాలుగు రోజులకు ఒకసారి గాబులు, మంచినీటి ట్యాంకులు, బిందెలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేకుంటే దోమలు విజృంభించి విషజ్వరాలను కలుగజేస్తాయని తెలిపారు.